క్లుప్తంగా

15నుంచి రాష్ట్ర స్థాయి శిక్షణ

భువనగిరిటౌన్ : వరంగల్ జిల్లా హనుమకొండ పట్టణంలో ఈనెల 15,16,17 తేదీల్లో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సామాజిక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ నాయకుడు అన్నంపట్ల కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో దళితుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు : తుంగతుర్తి నియోజకవర్గంలోని అన్ని చెరువులు, ఎస్సారెస్పీ కాల్వల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే మందుల సామేల్ కలిసి ప్రతిపాదనలు అందజేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

14న జనవిజ్ఞాన వేదిక జాతీయ మహాసభ

భువనగిరిటౌన్ : జన విజ్ఞాన వేదిక జాతీయ ఐదో మహాసభలను ఈనెల 14న బెంగళూరులో నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ కొడారి వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 36 సంవత్సరాలుగా ప్రగతి కోసం సైన్స్, ప్రజల కోసం సైన్స్, శాంతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదాలతో మెరుగైన పౌర సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదిక పనిచేసిందన్నారు.

ఘనంగా స్వర్ణగిరి శ్రీవారి నిత్యకల్యాణం



స్వామి వారికి నిత్యకల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం స్వామి వారి నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో పండితులు తులసిదళాలు, పలు రకాల పూలతో సహస్రనామార్చన, పద్మావతి అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని రాజన్న సిరిసిల్ల జిల్లా డీఆర్‌డీఓ శేషాద్రి, ధ్రువ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శరన్, తదితరులు దర్శించుకున్నారు.

వృద్ధులకు చేతికర్రల పంపిణీ



వృద్ధులకు చేతికర్రలు పంపిణీ చేసిన హెల్పేజ్ ఇండియా సంస్థ ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి : హెల్పేజ్ ఇండియా సంస్థ వృద్ధులకు అండగా నిలుస్తుందని ఆ సంస్థ ప్రాజెక్ట్ అధికారి టి.శార్థక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మెహర్‌నగర్, జలాల్‌పురం గ్రామాల్లో సీటీసీ, హెల్పేజ్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 28మంది వృద్ధులకు ట్రైపాడ్, ఎల్బో కచేస్, చేతికర్రలు అందజేశారు. ఈ అవకాశాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ యతేంద్రయాదవ్, మిర్నాల్ శ్రీకాంత్, వలంటీర్లు సుమలత, స్వరూప, చంద్రమ్మ, ఆనందం పాల్గొన్నారు.

ముత్యాల లక్ష్మమ్మకు పలువురి నివాళి



లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దేశ్‌ముఖి గ్రామానికి చెందిన భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ముత్యాల మహిపాల్‌రెడ్డి తల్లి ముత్యాల లక్ష్మమ్మ (75) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

పక్కా భవనాలు లేక ఇక్కట్లు

- ఆయా కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రాలు
- మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు
- నూతన భవనాలు నిర్మించాలని వేడుకోలు



నీర్నెములలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం



నీర్నెముల గ్రామంలోని పాలకేంద్రంలో నిర్వహిస్తున్న వైద్యసేవలు

రామన్నపేట : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు, వారి పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు ఆరోగ్య ఉపకేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని కేంద్రాలకు స్వంత భవనాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆయా గ్రామాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో సిబ్బంది వైద్యసేవలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా ఆరోగ్య ఉపకేంద్రాల్లో మౌలిక వసతులు లేక ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మునిపంపుల పీహెచ్‌సీ పరిధిలో తొమ్మిది సబ్‌సెంటర్లు..

మండలంలోని మునిపంపుల పీహెచ్‌సీ పరిధిలో తొమ్మిది సబ్‌సెంటర్లు ఉన్నాయి. మునిపంపుల, ఇంద్రపాలనగరం, నీర్నెముల, కక్కిరేణి, ఎన్నారం, సిరిపురం, రామన్నపేట, వెల్లంకి, లక్ష్మాపురం ఏర్పాటు చేశారు. వాటిలో మునిపంపుల, ఇంద్రపాలనగరం, నీర్నెముల, కక్కిరేణి, ఎన్నారం సబ్‌సెంటర్లకు స్వంత భవనాలు ఉన్నాయి. విగతా సబ్‌సెంటర్లకు సిరిపురం సబ్‌సెంటర్‌ను గ్రామపంచాయతీలో, రామన్నపేట సెంటర్‌ను కమ్యూనిటీ హాలులో, వెల్లంకిలో చేనేత క్లస్టర్ భవనంలో, లక్ష్మాపురం సెంటర్‌ను ఉన్నత పాఠశాల భవనంలో, నీర్నెముల ఆరోగ్య ఉపకేంద్రాన్ని స్థానిక పాలకేంద్రంలో నిర్వహిస్తున్నారు. వివిధ భవనాల్లో నిర్వహిస్తున్న సెంటర్లలో సరైన వసతులు లేక ఆస్పత్రికి వచ్చే రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. నీర్నెముల సబ్ సెంటర్ స్వంత భవనం శిథిలమై భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో అధికారులు భవనాన్ని మూసివేశారు.

నీర్నెములలో కనీస వసతులు కరువు..

నీర్నెముల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో నీర్నెములతో పాటు భోగారం, జనంపల్లి గ్రామాలు కలవు. మూడు గ్రామాల జనాభా ఆరువేల వరకు ఉంటుంది. అదే విధంగా ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు కలవు. ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా ప్రజలకు పలు రకాల వైద్యసేవలు, పిల్లలకు వ్యాక్సిన్లు ఇవ్వడంతో పాటు గర్భిణులకు రకరకాల పరీక్షలు నిర్వహిస్తారు. నీర్నెముల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి స్వంత భవనం 1999లో నిర్మించారు. సరైన నిర్వహణ లేకపోవడంతో పాతికేళ్లకే భవనం దెబ్బతింది. పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో ఉపకేంద్రంను స్థానిక పాలకేంద్రంలోని హాలులోకి మార్చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆరోగ్య ఉపకేంద్రాలకు నూతన భవనాలు నిర్మించడంతో పాటు సరైన మౌలిక వసుతులు కల్పించి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నూతన భవనం నిర్మించాలి



మా గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం శిథిలావస్థకు చేరడంతో పాలకేంద్రంలో నిర్వహిస్తున్నారు. అక్కడ కనీస వసతులు లేవు. మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాతభవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలి. ప్రజలకు వైద్యసేవలను మెరుగు పరచాలి. – నాగటి మనోహర, మహిళా నాయకురాలు, నీర్నెముల

ఆరోగ్య ప్రపంచానికి జనాభా నియంత్రణ అవసరం

- జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెనరు లింగారెడ్డి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారి లింగారెడ్డి, తదితరులు

భువనగిరి : ఆరోగ్యకరమైన ప్రపంచ నిర్మాణం కోసం జనాభా నియంత్రణ అవసరమని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెనరు లింగారెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వెన్నెల కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్త్రీల సాధికారత కోసం జనాభా నియంత్రణ– ఆరోగ్యకర జీవన విధానం అనే అంశంపై జిల్లా స్థాయి పోస్టర్ తయారీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా నియంత్రణ వాటి వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు విద్యార్థి దశలోనే పాఠ్యాంశాల ద్వారా అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహాలక్ష్మి, రమాదేవి, రాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.

విజేతలు..

మొదటి బహుమతి : ఎస్.డాలి శ్రీకళ, పదోతరగతి, ఆదర్శ పాఠశాల, చౌటుప్పల్
రెండో బహుమతి : పి.సాయికిరణ్, పదోతరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల, వెల్వర్తి, వలిగొండ
మూడో బహుమతి: ఎస్‌కే. జోయాజోబిన్, 9వ తరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల, రామన్నపేట

ఆలయ హుండీ ఆదాయం రూ.3.07లక్షలు

భువనగిరి : పట్టణంలోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయం హుండీ ఆదాయాన్ని శుక్రవారం ఆలయ ఆవరణంలో అధికారులు లెక్కించారు. సుమారు 100రోజులకు గాను రూ.3,07,715ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భద్రయ్య, రికార్డు అసిస్టెంట్ భానుప్రకాష్, కానిస్టేబుల్ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి



డీఎంహెచ్‌ఓ పాపారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి : ఔట్ సోర్సింగ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వై.పాపారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 2300 మంది ఏఎన్‌ఎంలు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నాలుగు సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నారని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు కవిత, మంజుల, సంధ్య, తేజ, పద్మ,ప్రశాంతి, జమున తదితరులు ఉన్నారు.

సమస్యలపై సీపీఐ అలుపెరుగని పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : ప్రజా సమస్యలపై సీపీఐ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండల పార్టీ జనరల్‌బాడీ సమావేశాన్ని స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ఉద్యమిస్తామన్నారు. నూతన రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. మల్లాపురం బైపాస్‌లో దాతారుపల్లి నుంచి మల్లాపురం వెళ్లే ప్రాంతంలో అండర్‌పాస్ ఏర్పాటు చేయాలన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ప్రజలకు ఇబ్బంది కరంగా మారిన బ్రిడ్జిని వెంటనే తొలగించాలని, పట్టణ బస్టాండ్‌లో అన్ని బస్సులు వచ్చి, నిలిచే విధంగా కృషి చేయాలన్నారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, ప్రజల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉద్యమ కార్యాచరణలో ముందుండాలన్నారు. మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, మండల కార్యవర్గ సభ్యులు ఆరె పుష్ప, మూనుకుంట్ల నర్సమ్మ, గుండ్లపల్లి నరేష్, రాజు, సత్యనారాయణ, చందునాయక్, సత్తిబాబు, కావ్య, రాజు, భాగ్యమ్మ తదితరులున్నారు.

చేనేత బోర్డును పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

ఆలేరురూరల్ : రాష్ట్ర ప్రభుత్వం చేనేత బోర్డును పునరుద్ధరించాలని, గత ప్రభుత్వం చేనేత కార్మికులకు అమలు చేసిన పథకాలను తిరిగి ప్రవేశపెట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో చేనేత కార్మికల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నూలుపై 40శాతం రాయితీ కల్పించాలని, నేతన్నల చేయూత థ్రిఫ్ట్ ఫండ్, చేనేత మిత్ర బీమా ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచాలన్నారు. సమావేశంలో చింతకింది మురళీ, సుదర్శన్, బేతి శ్రీను, బింగి నర్సింహులు, బేతి వెంకటేష్, రచ్చ దుత్తు, గుజ్జ పాండరి, కృష్ణ, సిద్దులు, సత్యనారాయణ, ఉప్పలయ యాదగిరి, మార్కెండేయ, కుమార్, తదితరలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎండీ ఇమ్రాన్

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ పార్టీ ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో ఇండియన్ ఆటోడ్రైవర్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడంతో ఉపాధి కోల్పోయిన ఆటోకార్మికుల కుటుంబాలకు ప్రతి నెల రూ.10వేలు ఇచ్చేంత వరకు త్వరలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామన్నారు. భువనగిరిలో ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించాలని, కొత్త బస్టాండ్‌లో ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గనబోయిన వెంకటేష్ (రాణా), సీనియర్ నాయకులు గొర్ల లక్ష్మణ్, ఎండీ షరీఫ్, ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు శానవాజ్, శకూర్, సల్మాన్, శ్రీను, చాంద్, అజయ్, జమీర్, సుల్తాన్, డానియేల్, స్వామి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

భువనగిరి రూరల్ : మండలంలోని చందుపట్ల పీఏసీఎస్ సభ్యురాలు చంచారం నర్సమ్మ(65) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో సంఘం డివిడెండ్ ఫండ్ నుంచి ఆమె వారసులకు చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బల్గూరి మధసూదన్‌రెడ్డి, సుబ్బూరి నరేందర్, దంతూరి నర్సింహ, గుర్రం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్ : మండలంలోని గౌస్‌నగర్ గ్రామానికి చెందిన రాచర్ల శంకరప్ప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబానికి శివస్వాముల బృందం ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నల్లమాసు బాలరాజుగౌడ్, భూషబోయిన నరసింహయాదవ్, పాక జహంగీర్‌యాదవ్, నల్లమాసు ప్రసాద్‌గౌడ్, రాగీరు పాండుగౌడ్, పాక శంకర్‌యాదవ్, కుటుంబ సభ్యులు రాచర్ల కమలమ్మ, రాచర్ల వేణు ఉన్నారు.

భువనగిరి రూరల్ : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు శంకరయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. శుక్రవారం శంకరయ్య కుటుంబానికి కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పరామర్శించి 50కిలోల బియ్యాన్ని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు అందజేశారు. పరామర్శించిన వారిలో సంఘం మండల అధ్యక్షుడు పాండాల మైసయ్యగౌడ్, నాయకులు కొండ మల్లేశ్, రాంపల్లి సత్యనారాయణ, రాంపల్లి సోములు, కొండ అశోక్, కొండ నందు, వద్ది లింగమయ్య, ఎడ్ల కృష్ణ, అంతరి మల్లేశ్, ఆకుల స్వామి, వద్ది నందు ఉన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన నర్సింహకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. నర్సింహ ఇల్లు కొద్దిరోజుల క్రితం వర్షానికి కూలిపోయింది. దీంతో నర్సింహ పరిస్థితిని కోమటిరెడ్డి అభిమాని, సామాజిక కార్యకర్త క్లైం ధర్మలీల మంత్రి దృష్టికి తీసుకెళ్లింది అందుకు స్పందించిన మంత్రి ఆమె ద్వారా బాధితుడికి ఆర్థికసాయం అందజేశారు.

కళాకారులకు డప్పుల పంపిణీ



డప్పులు పంపిణీ చేస్తున్న శ్రీశైలం

గుండాల : మండలంలోని వస్తాకొండూర్ గ్రామంలో డప్పుల కళాకారులకు ఆ గ్రామ మాజీ వార్డు మెంబర్ శ్యామల శ్రీశైలం శుక్రవారం డప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాకారులు తమ నైపుణ్యాలతో ప్రజలను ఆకట్టుకొని అంతరించిపోతున్న కళలను గుర్తు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం, అనిల్, కళాకారులు పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీఓ సురేష్

బొమ్మలరామారం : విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అదనపు డీఆర్‌డీఓ సురేష్ సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధిహామీ పనులు అత్యంత పారదర్శకంగా చేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనుల నిర్వహణలో పనుల గుర్తింపు మెజర్‌మెంట్‌లు, వేతనాలు చెల్లింపులో పగడ్బందీగా చేపట్టాలన్నారు. పనిప్రదేశంలో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్ రవికుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి చండీరాణి, అంబుడ్స్‌మెన్ వీరమల్లు, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, అడిషనల్ ప్రోగ్రాం అధికారి శ్రీలక్ష్మి, ఈసీ పుష్పలత, జనగాం శేఖర్ గౌడ్, ధనావత్ రవీందర్‌నాయక్, బైరగోని రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రంగు దినోత్సవం



పసుపురంగు వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ.కృష్ణారావు

చౌటుప్పల్ : పట్టణంలోని ట్రినిటీ పాఠశాలలో శుక్రవారం పసుపురంగు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు, ఉపాధ్యాయినులు పసుపు రంగు దుస్తులు ధరించి సందడి చేశారు. ఈ సందర్భంగా పసుపురంగులో ఉన్న పండ్లు, కూరగాయలు, ఆహారపదార్థాలు, వంటకాలను ప్రదర్శించారు. అదే విధంగా ఆషాఢ మాస గోరింటాకు మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ.కృష్ణారావు, డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, పాఠశాల సమన్వయకర్తలు మాలిక్, శివరాణి, నీరజ, స్వప్న, అనూష, లక్ష్మిప్రియ, జ్యోతి, సింధు, ఉమామహేశ్వరి, హారిక, శిరీష, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మోటకొండూర్ : అమ్మనబోలులో డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న డీపీఓ సునంద

మోటకొండూర్ : వర్షాకాలం నేపథ్యంలో గ్రామస్తులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చూడాలని డీపీఓ సునంద ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మాటూర్, అమ్మనబోలు, ఇక్కుర్తి గ్రామాల్లో శుక్రవారం డ్రై డే పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అధికారులు గ్రామాల్లో శానిటైజింగ్ పనులు సక్రమంగా చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీఓ కిషన్, కార్యదర్శులు సీస అశోక్‌గౌడ్, బాల్ద మల్లేశం, రినీఉజ్వల తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : గ్రామాల్లో అంటువ్యాధులు రాకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీఓ నిరంజన్‌వలీ అన్నారు. శుక్రవారం మండలంలోని రహీంఖాన్‌పేటలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రెయినేజీలను పరిశీలించారు. డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ బి.రమేష్, పంచాయతీ కార్యదర్శి స్వాతి, అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, మమత, వీవీకేలు నిర్మల, జయమ్మ, కారోబార్ పత్తెపురం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని బొడ్రాయికి పూజలు



వలిగొండ : బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు



మోత్కూరు : చుట్టుకాముడు ఆడుతున్న మహిళలు

వలిగొండ : మండలంలోని పహిల్వాన్‌పురంలో వర్షాలు కురవక రైతులు, ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శుక్రవారం గ్రామ మహిళలు బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం చేశారు. వాన దేవుడి పాటలు పాడుకుంటూ బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో బందారపు బాలమణి, క్లైం కళమ్మ, సరితా, బట్టపెల్లి అంజమ్మ, శంకరమ్మ, బండారి అరుణ, వేముల వినోద, అలివేలు, రేణుక, లతాశ్రీ పాల్గొన్నారు.

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో వరుణుడి కరుణించి విరివిగా వర్షాలు కురిపించాలని ప్రార్థిస్తూ శుక్రవారం బొడ్రాయికి మహిళలు జలాభిషేకం చేశారు. ముందుగా స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో చుట్టుకాముడు ఆడి వరుణ దేవుడు కరుణించాలని పాటలతో మహిళలు కీర్తించారు. అనంతరం బొడ్రాయి వద్దకు వెళ్లి జలాభిషేకం చేశారు.

రాజాపేట : వర్షాలు కురవాలని శుక్రవారం మండలంలోని నెమిల గ్రామంలో చిన్నారులు కప్పతల్లి ఆట ఆడారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పాటలు పాడారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు.

పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మోత్కూరు : మండలంలోని పాలడుగు గ్రామానికి పంచాయతీ కార్యదర్శిని నియమించాలని, మున్సిపల్ కేంద్రంలోని కాశవాడకాలనీకి రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, ఆరోగ్య ఉపకేంద్రంలో మందులు అందుబాటులో ఉంచాలని కోరుతూ శుక్రవారం సీపీఎం మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. పాలడుగులో పంచాయతీ కార్యదర్శి లేక, ప్రత్యేక అధికారి సందర్శించక అధికారుల పర్యవేక్షణ కరువై పనులు కుంటు పడుతున్నాయన్నారు. కాశవాడకాలనీలో సంచార జాతికి చెందిన దినసరి కూలీలకు ఇబ్బందిగా ఉందని ప్రత్యేక రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని, గడి బజార్‌లోని ఆరోగ్య ఉపకేంద్రంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని కోరుతూ ఆయా కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, సీనియర్ నాయకులు పైళ్ల యాదిరెడ్డి, పట్టణ కార్యదర్శి కూరపాటి రాములు, దడిపల్లి ప్రభాకర్, కొంపల్లి ముత్తమ్మ, పిట్టల చంద్రయ్య, చింతకింది సోమరాజ్, గంగయ్య, లక్ష్మణ్, సైదులు, పార్వతమ్మ, రాచకొండ రాములమ్మ, గుండు లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ధర్నా

వలిగొండ : మండలంలోని సుంకిశాల సమీపంలోని మేఘా గ్యాస్ కంపెనీ నుంచి సుంకిశాల వరకు ధ్వంసమైన బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్యాస్ కంపెనీ వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, కొండె కృష్ణయ్య, మంగ బాలయ్య, చెరుకు జంగయ్య, గుర్రం సత్తిరెడ్డి, పెద్దస్వామి, బొందయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

భువనగిరి క్రైం: పట్టణంలోని డాల్ఫిన్ హోటల్ సమీపంలో గల శబరీనగర్‌లో శశికుమార్ అనే వ్యక్తి తన దుఖాణంలో అక్రమంగా గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అనంతరం వాటిని పట్టణ పోలీసులకు అప్పగించారు. గుట్కా ప్యాకెట్ల విలువ సుమారు రూ.3వేల వరకు ఉంటాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీలు, పదోన్నతుల్లో వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. పదోన్నతిపై వెళ్లిన మన్నె అగ్గిరాములు, టి.ఉప్పలయ్య, ఎ.రామానుజమ్మ, బదిలీపై వెళ్లిన సీహెచ్.స్వప్న, కె.నాగలక్ష్మి, బి.వీరాచారి, పి.కృష్ణ, వి.నరేష్‌లను పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మిర్యాల దామోదర్, ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, బండారు మల్లయ్య, వి.యాదయ్య, దర్శనం వెంకన్న, చిరుమర్తి యాదయ్య తదితరులున్నారు.

24గంటల వైద్యసదుపాయం కల్పించాలి

గుండాల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటల వైద్య సదుపాయం కల్పించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ఆయన వెంట సత్యనారాయణ, ఖలీల్ ఉన్నారు.